సాక్షి చిత్తూరు

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



తప్ప కదా గురూ!

మెగా డీఎస్సీలో కొందరు అడ్డదారులు తొక్కారు. తప్పుడు ధ్రువపత్రాలతో పోస్టులు కొట్టేసేందుకు ఎత్తుగడ వేశారు. - 8లో



పెళ్లికి నిరాకరించిందనీ..

ఎనిమిదేళ్లు సహజీవనం చేసిన యువతి పెళ్లికి నిరాకరించిందని ఓ యువకుడు బావిలో దూకి తనువు చాలించాడు. - 8లో



కానిస్టేబుల్ శిక్షణకు..

ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థుల శిక్షణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఎస్పీ మణికంఠ సిబ్బందిని ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు రావణ బ్రహ్మ వాహనం

కాణిపాకం: ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలో ఆదివారం రావణబ్రహ్మ వాహన సేవ ఉంటుందని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, రాత్రి రావణ బ్రహ్మ వాహన సేవ జరగుతుందన్నారు. భక్తులు పాల్గొన్ని స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

పంచాయతీలకు సొంత భవనాలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో 17 పంచాయతీలకు సొంత భవనాలు సమకూరనున్నాయి. ఈ మేరకు శాఖా పరంగా అనుమతులిచ్చారు. ఒక్కో భవనాన్ని 1,226 చ.అ విస్తీర్ణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మించనున్నారు. ఒక్కో భవనానికి రూ.32 లక్షల చొప్పున ఖర్చు చేయనున్నారు. ఇందులో రూ.7 లక్షలు ఉపాధిహామీ పథకం నుంచి కేటాయించనున్నారు. మిగిలిన నిధులు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద వెచ్చించనున్నారు. ఐదు సెంట్ల భూమి అందుబాటులో ఉన్నచోటనే నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు బైరెడ్డిపల్లె మండలంలోని పాతపేట, గొనితిమ్మెపల్లె పంచాయతీలు, విజయపురంలోని పాత ఆర్కాడ్, సామిరెడ్డికండ్రిగ, జీడీ నెల్లూరులోని పాపిరెడ్డిపల్లె, గుడిపాలలో వెంగమాంబపురం, గట్రాలమిట్ట, నగరిలో వేలవాడి, పెనుమూరులో కాతిరెడ్డిపల్లె, తవణంపల్లెలో ముత్తుకూరు, రొంపిచెర్లలో జానవారిపల్లె, కార్వేటినగరంలో కేశవకుప్పం, ఐరాలలో 45 కొత్తపల్లె, రామకుప్పంలో ననియాలతాండ, బంగారుపాళ్యంలో జయంతి, నింద్రలో మేళంబాకం, శాంతిపురంలో నడింపల్లెలకు భవనాలు మంజూరైనట్టు డీపీఓ సుధాకర్‌రావు వివరించారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు పోటీ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ట్రాన్స్‌జెండర్స్ నిరుద్యోగులకు పోటీపరీక్షలు, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ట్రాన్స్‌జెండర్స్ నిరుద్యోగులకు రాష్ట్ర, జాతీయ స్థాయి, ఐటీ, కెరీర్ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు ప్రభుత్వ పోటీ పరీక్షలైన (ఎస్ఎస్‌సీ, ఏపీపీఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, పోలీస్, గ్రామ, వార్డు సచివాలయాల పోస్టులు), ప్రముఖ ప్రైవేట్ ఎంఎన్‌సీ కంపెనీలలో ప్లేస్‌మెంట్స్ పొందేందుకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ఇంటర్మీడియెట్ స్థాయి ట్రాన్స్‌జెండర్స్‌కు (370 గంటలు) ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, పలు టెస్టులు, డిగ్రీ స్థాయి ట్రాన్స్‌జెండర్స్‌కు (650 గంటలు) అడ్వాన్స్‌డ్ ఆప్టిట్యూడ్, న్యూస్‌పేపర్ అనాలసిస్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పలు అంశాలపై ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని విభిన్నప్రతిభావంతుల శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నకిలీ వైద్యానికి తాళం!

అమాయక రోగులను ఆకర్షిస్తారు. వచ్చీరాని వైద్యం చేస్తూ అడ్డగోలుగా దోచేస్తారు. అర కొర అవగాహనతో అబార్షన్ల నుంచి.. ప్రసవాలదాకా చేసేస్తారు. జాయింట్లకు కూడా వీళ్లే సూదులు పొడిచేస్తారు. ఇబ్బడిముబ్బడిగా యాంటీబయాటిక్స్, సెలైన్లు రాసేస్తారు. అవసరం లేకపోయినా స్టెరాయిడ్లు, ఓవర్ దోసులు రాసేస్తారు. పశువుల ఆస్పత్రిగా బోర్డులు పెట్టి మనుషులకూ చికిత్సలు ప్రారంభిస్తారు.. కేవలం ప్రథమ చికిత్స చేయాల్సింది పోయి.. ఎంబీబీఎస్ డాక్టర్లుగా వ్యవహరిస్తూ గ్రామీణ రోగులను ఆకర్షిస్తారు.. ఇంతకీ వీరంతా ఎవరనుకుంటున్నారా..? అదేనండీ మన జిల్లాలో పాతుకుపోయిన ఆర్ఎంపీలు, పీఎంపీలు. వీరి భరతం పట్టేందుకు కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్యారోగ్యశాఖ సిద్ధమైంది. శనివారం ఏకంగా 141 క్లినిక్‌లను తనిఖీ చేసి, అందులో 43 క్లినిక్‌లను సీజ్‌చేసింది. నకిలీ వైద్యానికి.. శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లకు ముకుతాడు వేసింది. అందుబాలో బయటపడ్డ వాస్తవాలు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సి వస్తోంది.

- జిల్లాలో మితిమీరిన ఆర్ఎంపీలు, పీఎంపీలు
- బోగస్ సర్టిఫికెట్లతో పుట్టగొడుగుల్లా క్లినిక్‌లు
- పశువైద్యం పేరుతో మనుషులకూ వైద్యం
- వైద్య ఆరోగ్యశాఖ తనిఖీల్లో నకిలీల గుట్టు రట్టు
- 43 క్లినిక్‌ల సీజ్
- తాళం ఇవ్వాలని అధికారులపై కూటమి నేతల ఒత్తిళ్లు



ఆర్ఎంపీ క్లినిక్‌లో అధికారుల తనిఖీలు



43 క్లినిక్‌లకు తాళం

కలెక్టర్ ఆదేశాలతో 141 ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై దాడులు నిర్వహించారు. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 43 క్లినిక్‌లను అధికారులు సీజ్ చేశారు. అయితే చిత్తూరు, నగరి ప్రాంతాల్లోనే అధికంగా తనిఖీ చేయగా.. అధికంగా క్లినిక్‌లు ఉండే కుప్పం, పలమనేరు, జీడీనెల్లూరులో తూతుమంత్రంగా చేపట్టడం వెనుక ఆంతర్యమేమిటో అంతుపట్టడం లేదు. పుంగనూరులో అయితే అసలు తనిఖీలే చేయలేదు.

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో 2వేల వరకు ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లున్నాయి. కాంపౌండర్లు, మందుల దుకాణాల్లో పనిచేసిన వ్యక్తులు, ఇతర ఉద్యోగాలు చేస్తూ సంపాదించాలనే ఆలోచనతో ఉన్న వ్యక్తులు ఈ ఆస్పత్రులను నెలకొల్పారు. అర్హత, అనుభవం లేని వైద్యులను తీసుకొచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో క్లినిక్‌లు నిర్వహిస్తూ..అక్కడి నిబంధనలతో జిల్లా సరిహద్దులో పాగా వేశారు. కుప్పం, వీ.కోట, పలమనేరు, యాదమరి, గుడిపాల, చిత్తూరు, పుంగనూరు, ఎస్ఆర్‌పురం, నగరి, జీడీనెల్లూరు, పాలసముద్రం తదితర మండలాల్లో పాతుకుపోయారు. వీరు పల్లె రోగులను ఆకర్షిస్తూ.. ప్రథమ చికిత్స వదలి.. ఎంబీబీఎస్ వైద్యులుగా బోర్డులు పెట్టేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో దాడులు

జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వారం క్రితం కలెక్టర్ దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ మేరకు ఆ శాఖ అధికారులు ఏడు కమిటీలను నియమించారు. నియోజవర్గానికి ఒక పోగ్రాం ఆఫీసర్, ఒక మండల వైద్యాధికారి, ఇద్దరు సూపర్‌వైజర్ల చొప్పున్న కమిటీలు వేశారు. వీరు రెండు రోజుల పాటు ఆరు నియోజకవర్గాల్లో దాడులు నిర్వహించారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న పత్రం

అబార్షన్లకు కేంద్ర బిందువు

జిల్లాలో పలు ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లు అబార్షన్లకు కేంద్రబిందువుగా మారాయి. నకిలీ క్లినిక్‌ల్లో గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్లు జరిగిపోతున్నాయి. ఇందుకు పలు ఆర్ఎంపీలు, పీఎంపీలు రూ.10 నుంచి రూ.20వేల వరకు ఫీజుగా వసూలు చేస్తున్నారు. అలాగే ప్రసవాలు చేస్తూ....ఎంబీబీఎస్ వైద్యులుగా వ్యవహరిస్తున్నారని తనిఖీలో అధికారులు గుర్తించారు.

నకిలీ వైద్యులకు..కూటమి నేతల అండ?

కొందరు నకిలీగాళ్లకు కూటమి నేతలు సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో ఆర్ఎంపీల క్లినిక్‌లపై దాడులు చేపట్టిన అధికారులకు... నకిలీ ఆర్ఎంపీలు, పీఎంపీలు, కూటమి నేతలు నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. వెంటనే తాళాలు ఇచ్చేయాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం. ఇక యాదమరి పీహెచ్‌సీలో పనిచేసే సిబ్బంది తన అనుమతి లేకుండా ఎలా తనిఖీ చేస్తారని ఓ పోగ్రాం ఆఫీసర్‌పై చిందులేయడం విమర్శలకు తావిచ్చింది.

గుట్టు..రట్టు ఇలా!

- జిల్లాలోనే ఏపీ క్లినిక్ కేర్ ఎస్టాబ్లిస్‌మెంట్ యాక్ట్ ప్రకారం ఏ ఒక్క ఆర్ఎంపీకి, పీఎంపీకి రిజిస్ట్రేషన్ లేదు.
- ఆర్ఎంపీ, పీఎంపీలుగా గుర్తింపు పొందినట్లు నకిలీ సర్టిఫికెట్లు ఉన్నవాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- అసోసియేషన్ల ద్వారా సభ్యులుగా పత్రాలు పెట్టుకుని ఆర్ఎంపీలు, పీఎంపీలుగా చెలామణి అవుతున్నారని, ఇందుకు తిరుపతి, ఐరాల, పెద్దపంజాణి, నగరి, పలమనేరు ప్రాంతాల్లో రూ.10వేలు ఇచ్చి అసోసియేషన్‌లో సభ్యులుగా చేరుతూ... పత్రాలు తెచ్చుకుని క్లినిక్‌లు నడుపుతున్నారని అధికారులు గుర్తించారు.
- నిబంధనలకు విరుద్ధంగా మందులు, మాత్రలు ఇస్తున్నారని, యాంటిబయోటిక్ ఇంజక్షన్‌లు, స్టెరాయిడ్స్ విచ్చలవిడిగా ఇస్తున్నారని తనిఖీల్లో తెలుసుకున్నారు. వీళ్లే మందులు, మాత్రల సరఫరా, విక్రయాలు కూడా చేస్తున్నట్టు గుర్తించారు. వీటిని చాలా వరకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- సెలైన్లు ఎక్కించడం, రక్త పరీక్షలు చేయడం, కుట్లు వేయడం, మోకాళ్లల్లో ఇంజెక్షన్‌లు ఇవ్వడం, బెడ్లు ఏర్పాట్లు చేసుకుని చికిత్స అందించడం, గర్భవతులకు, చిన్న పిల్లలకు వైద్యం చేయడాన్ని గుర్తించారు.
- చిత్తూరు నగరం పెనుమూరు క్రాస్‌లోని పశువుల ఆస్పత్రిగా బోర్డుపెట్టుకుని మనుషులకు చికిత్స చేస్తున్నట్లు గుర్తించారు.

జిల్లాలో తనిఖీలు, సీజ్ చేసిన క్లినిక్‌ల వివరాలు

నియోజకవర్గం	తనిఖీలు చేసిన క్లినిక్‌ల సంఖ్య	సీజ్‌చేసిన క్లినిక్‌ల సంఖ్య
చిత్తూరు	40	10
నగరి	41	19
పలమనేరు	05	02
జీడీనెల్లూరు	09	03
కుప్పం	07	04
పూతలపట్టు	15	05
పుంగనూరు	0	0

ప్రసవాల సంఖ్య

నెల	మగ పిల్లలు	ఆడ పిల్లలు
జూన్	1,359	1,102
జూలై	1,181	1,030
ఆగష్టు	1,194	1,038
మొత్తం	3,734	3,170

ఉక్కుపాదం మోపుతాం



ఆర్ఎంపీలు, పీఎంపీలే యాంటీబయోటిక్ మందులు, మాత్రలు, సరఫరా చేస్తున్నారు. వీళ్లే చికిత్సలు చేస్తున్నారు. జాయింట్లకు కూడా సూదులు వేస్తున్నారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు అనధికారిక క్లినిక్‌లపై తనిఖీలు చేస్తున్నాం. ఇప్పటి వరకు వందకు పైగా క్లినిక్‌లను తనిఖీ చేస్తే 43 దాకా సీజ్ చేశాం. వాటి వివరాలను రాష్ట్ర స్థాయి అధికారులకు పంపుతున్నాం. వారి ఆదేశాలతో తదుపరి చర్యలు ఉంటాయి. నకిలీ వైద్యంపై ఉక్కుపాదం మోపుతాం. వదలిపెట్టే ప్రసక్తే లేదు.

– డాక్టర్ సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

అధికార నంది వాహనంపై గణాధీశుడు

కాణిపాకం: కాణిపాక శ్రీసిద్ధి, బుద్ధి వినాయకస్వామి అధికార నంది వాహనంపై అభయమిచ్చారు. కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలో శనివారం ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేయించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి వళ్లువర్ వంశస్థుల ఆధ్వర్యంలో అధికార నంది వా హన సేవను నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తిని అలంకరించి నంది వాహనంపై ఆశీనులు చేశారు. ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో చేపట్టారు.



నంది వాహనంపై వరసిద్ధి వినాయకుడు

పలువురికి పదవులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలువురికి పదవులు వరించాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలువురిని పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా(పార్లమెంటు) నియమించారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో వీరికి పదవులు కేటాయించినట్లు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటించింది. చిత్తూరు జిల్లాకు చెందిన దయాసాగర్‌రెడ్డికి నగరి, చంద్రగిరి, ఎం.కృష్ణమూర్తికి కుప్పం, పూతలపట్టు, వెంకట్‌రెడ్డియాదవ్‌కు పలమనేరు, చిత్తూరు, అనీషారెడ్డికి పుంగనూరు, మదనపల్లె, రాకేష్‌రెడ్డికి జీడీ నెల్లూరు, తంబళ్లపల్లెను కేటాయించారు. తిరుపతి జిల్లాకు చెందిన బీరేంద్రవర్మకు గుడూరు, సూళ్లూరుపేట, ఓ.గిరిధర్‌రెడ్డికి శ్రీకాళహస్తి, తిరుపతి, కే.కల్పలతరెడ్డికి వెంకటగిరి, సత్యవేడును కేటాయించారు. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, సంబంధిత రీజనల్ కో–ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరించనున్నారు.

మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకొస్తారు



చౌడేపల్లెలో మిథున్‌రెడ్డికి మధ్యంతర బెయిల్ రావడంతో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- మధ్యంతర బెయిల్‌పై చౌడేపల్లెలో సంబరాలు
- మహానేతకు ఘన నివాళి

చౌడేపల్లె: అక్రమ కేసుల నుంచి ఎంపీ పీవీ.మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటకొస్తారని జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.దామోదరరాజు, మండల పార్టీ కన్వీనర్ జి. నాగభూషణ రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ స్పష్టం చేశారు. శనివారం అక్రమ కేసులో నుంచి మిథున్‌రెడ్డికి మధ్యంతర బెయిల్ రావడంతో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. తొలుత దివంగత మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. బస్టాండులో బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కుట్రలకు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఇకనైనా వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు, దాడులు ఆపాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేసే బుద్ధిని ప్రసాదించాలని దేవుడ్ని కోరారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ శ్రీరాములు, కో–ఆప్షన్ మెంబరు సాధిక్‌బాషా, సర్పంచులు ఓబుల్‌రెడ్డి, రఘురామిరెడ్డి, భాగ్యవతి, షంషీర్, నాయకులు చెంగారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, షఫీ, వినోద్‌రెడ్డి, ఓబులేసు, కృష్ణప్ప, శంకరప్ప, హనుమంతురెడ్డి, అనుప్రియ, శ్రీనివాసులు, భాస్కర్, అల్తాఫ్, గిరి, భాస్కర్‌రెడ్డి, బాబు తదితరులున్నారు.



చౌడేపల్లె బస్టాండులో బాణసంచా పేల్చుతున్న పార్టీ నేతలు

విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోంది. గత ప్రభుత్వంపై కక్ష సాధింపులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను దూరం చేసింది. ఇది చాలదన్నట్టు ఇప్పుడు ఉపాధ్యాయులపై గుదిబండను మోపుతోంది. నూతన సంస్కరణల పేరిట సవాలక్ష పనులు అప్పజెబుతోంది. వీటితోనే సమయం మొత్తం సరిపోతోంది. విద్యార్థులకు న్యాయం చేయలేకపోతున్నామని, సకాలంలో సిలబస్ కూడా పూర్తి చేయలేకపోతున్నామని గగ్గోలు పెట్టాల్సి వస్తోంది.

గురువుపై బరువు

- విద్యావ్యవస్థలో నూతన సంస్కరణలు
- ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షలకు అసెస్‌మెంట్ బుక్‌లెట్
- మార్కుల నమోదుతో పాటు స్కానింగ్ బాధ్యతా టీచర్లదే
- సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయలేమంటున్న అయ్యోర్లు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్

కార్వేటినగరం: పాఠాలు చెప్పి విద్యార్థులను ఉన్నంతగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై కూటమి ప్రభుత్వం భారం మోపుతోంది. మూల్యాంకనంలో తీసుకొచ్చిన అసెస్మెంట్ బుక్‌లెట్ విధానం గుదిబండగా మారింది. వాస్తవానికి ఫార్మేటీవ్, సమ్మేటీవ్ పరీక్షలు ఏడాది పొడవునా జరుగుతూనే ఉంటాయి. వీటికి సంబంధించిన జవాబు పత్రాలు, ఓఎమ్మార్ షీట్లను అసెస్మెంట్ బుక్‌లెట్‌లో పొందుపర్చాలి. ఈ పరీక్షలకు సంబంధించిన అన్ని మార్కులను ఇందులోనే నమోదు చేయాలి. ఒక్కో పరీక్షకు సంబంధించి 100 జవాబు పత్రాలను దిద్దాల్సి ఉంది. దీనిపై ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. గురుపై బరువెందుకు బాబూ..? అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఇదీ లెక్క!

నిజానికి విద్యార్థులకు ఏడాదిలో నాలుగు ఫార్మేటీవ్‌లు, రెండు సమ్మేటీవ్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. ప్రశ్నపత్రం, ఓఎమ్మార్ షీట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందించేది. జవాబు పత్రాలను విద్యార్థులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. వీటిని టీచర్లు మూల్యాంకనం చేసి మార్కులను ఓఎమ్మార్ షీట్లలో పొందుపర్చేవారు. ఆపై జిల్లా అధికారులు స్కానింగ్ చేసి భద్రపరిచేవారు. మూల్యాంకనాన్ని మూడు రోజుల్లో పూర్తిచేయాలనే నిబంధన ఉండేది. దీంతో బోధించేందుకు ఉపాధ్యాయులకు ఎక్కువ సమయం ఉండేది.

కొత్తగా ఇలా..

ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి పరీక్షల విధానంలో నూతన సంస్కరణలను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఫార్మేటీవ్, సమ్మేటీవ్ పరీక్షల కోసం అసెస్మెంట్ బుక్‌లెట్‌ను ప్రవేశపెట్టింది. పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలు, ఓఎమ్మార్ టీప్లను ఇందులో పొందుపరిచాలి. టెస్ట్ సమయంలో విద్యార్థులకు అసెస్మెంట్ బుక్‌లెట్‌ను ఇచ్చి అందులో జవాబులు రాయించాలి. ఇందులో వచ్చిన మార్కులను ఓఎమ్మార్ షీట్‌లో పొందుపరచడంతో పాటు స్కానింగ్‌ను కూడా ఉపాధ్యాయులే చేయించాలి. ఈ బుక్‌లెట్‌లో విద్యార్థి ఆధార్, యూడైస్, పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్లనూ వీరే నమోదు చేయాలి. ఈ రకంగా ఏడాదిలో సబ్జెక్టుకు 6, 7 తరగతులకు 36, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 42 ఓ ఎమ్మార్ షీట్లుంటాయి. విద్యాసంవత్సరం ముగిసేంత వరకు జవాబు పత్రాలు, వారికొచ్చిన మార్కులను ఇందులో నమోదు చేయాలి. వీటిని పాఠశాలల్లోనే భద్రపరచాలి. ఇంటికి తీసుకెళ్లకూడదు.



ప్రభుత్వ పాఠశాలలకు కూటమి ప్రభుత్వం అందించిన అసెస్మెంట్ బుక్‌లెట్

జిల్లా సమాచారం

పాఠశాల స్థాయి	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	2,113	83,874
ప్రాథమికోన్నత	237	21,950
ఉన్నత	312	62,231
మొత్తం విద్యార్థులు	–	1,68,055మంది

పెరిగిన ఒత్తిడి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన లీప్ యాప్‌లో ఐఎమ్మెమ్మెస్, స్టూడెంట్స్ కిట్స్, మెగా పేటీఎంలను ఉంచారు. దీంతో పాటు పాఠశాలకు ప్రతి నెలా అందిన బియ్యం, బస్తాలపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అందులోని నాణ్యతను పరిశీలించి ఆన్‌లైన్లో నమోదు చేయాలి. ఈ క్రమంలో ప్రభుత్వం పునరాలోచించి అసెస్మెంట్ విధానానికి స్వస్తి పలికి పాత పద్ధతినే కొనసాగించాలని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘనాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అనాలోచిత నిర్ణయం



ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో అసెస్మెంట్ విధానం పిల్లలనే కాకుండా ఉపాధ్యాయులనూ పరీక్షించే విధంగా మారింది. దీని వల్ల బోధనకు వారం పాటు దూరంగా ఉండాల్సి వస్తోంది. ప్రాజెక్టుల పేరుతో విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తున్నారు. తరగతికి మించిన స్థాయిలో ప్రశ్నపత్రం ఉంటోంది. ఇలాంటి పనులతో ఉపాధ్యాయులు బోధనకు దూరంగా ఉంటున్నారు.

– కిరణ్, ఏపీటీఎఫ్1938 చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, కార్వేటినగరం

అసెస్‌మెంట్ విధానాన్ని తొలగించాలి



అసెస్మెంట్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తొలగించాలి. ఈ ప్రక్రియ కారణంగా ఉపాధ్యాయుల బోధనకు ఆటంకం ఏర్పడుతోంది. బోధనేతర పనుల భారాన్ని మోపడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. మూల్యాంకనంలో పాత విధానాన్నే కొనసాగించాలి.

– చలపతిరావు, ఏపీటీఎఫ్ 1938 జిల్లా సీపీఎస్సీ అధ్యక్షుడు, కార్వేటినగరం

పొలాల వద్దకు వెళ్లకండి





పాతపేటలోని నటరాజ పొలంలో విరిచేసిన డ్రిప్ పరికరాలు, రెడ్డెప్ప పొలంలో ధ్వంసమైన కొబ్బరి చెట్లు

పులిచెర్ల(కల్లూరు): ఏనుగులు కల్లూరు రిజర్వు ఫారెస్టులో తిష్ట వేసి ఉన్నాయని, సమీప గ్రామాల రైతులు రాత్రి పూట పొలాల వద్దకు వెళ్లరాదని అటవీ అధికారులు సూచించారు. ప్రస్తుతం పాతపేట సమీప అటవీ ప్రాంతంలో ఏనుగులు ఉండడంతో రైతులు ఎవ్వరూ ఆ చుట్టు పక్కల సంచరించరాదన్నారు. తెలుపు రంగు దుస్తులు వేసుకొని అసలు వెళ్లకూడదని హెచ్చరించారు. ఎక్కడైనా ఏనుగులు కనిపిస్తే తరమ కూడదని, అదిలించకూడదని సూచించారు. వెంటనే ఫారెస్టు సిబ్బంది 9550067503 నంబరుకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

పంటలు ధ్వంసం

మండలంలోని పాతపేట పంచాయతీలో శనివారం తెల్లవారు జామున ఏనుగులు పంట పొలాలపై పడి సర్వనాశనం చేశాయి. వారం రోజులుగా ఏనుగుల మంద పాతపేట, చల్లావారిపల్లె పంచాయతీల్లోని పంట పొలాలను ధ్వంసం చేస్తున్నట్టు పలువురు రైతులు వాపోతునానరు. పాతపేటకు చెందిన నటరాజ పొలంలో ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలు, రెడ్డెప్ప పొలంలో కొబ్బరి చెట్లను విరిచి వేశాయన్నారు.

కానిస్టేబుల్ శిక్షణకు పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు అర్బన్: కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు తొమ్మిది నెలల పాటు ఇచ్చే శిక్షణ కోసం.. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ సిబ్బందిని ఆదేశించారు. శనివారం చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ త్వరలోనే కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ ప్రారంభిస్తామన్నారు. శిక్షణ కాలంలో తరగతి గదులు, భోజనాలు, వసతులు అన్నీ పక్కాగా ఉండాలన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ వెంట ఎంటీవో చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

స్వామివారి సేవలో ఐజీ



స్వామి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శనివారం రాష్ట్ర పోలీసు శాఖ ఐజీ అడ్మిన్ శ్రీకాంత్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. డీఈవో సాగర్‌బాబు పండితుల చేతుల మీదుగా ఆశీర్వచనాలు, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పెళ్లికి నిరాకరించిందని ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: ఓ యువతితో సహజీవనం చేసి ఆపై పెళ్లి చేసుకోవడానికి అడిగితే నిరాకరించడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చిత్తూరు నగరంలో శనివారం వెలుగు చూసింది. టూటౌన్ సిఐ నెట్టికంటయ్య కథనం మేరకు... తేనె బండకు చెందిన సతీష్ (27) స్థానికంగా ఓ మహిళతో ఎనిమిదేళ్లకు పైగా సహజీవనం కొనసాగించాడు. అయితే ఇటీవల పెళ్లి ప్రతిపాదన తీసుకురాగా యువతి నిరాకరించింది. దీంతో మనస్తాపం చెందిన సతీష్.. తేనె బండ సమీపంలోని ఓ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బావిలో నుంచి సతీష్ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కుప్పం: పట్టణంలోని పెదసులి గంగమ్మ దేవాలయం వద్ద ఓ వ్యక్తి మృతి చెందాడు. శనివారం అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని చూసి స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. వి.కోటను చెందిన నందగోపాల్ పట్టణంలోని బీసీ కాలనీలో తన మామ రాజప్ప ఇంటికి శుక్రవారం వచ్చాడు. ఆరోగ్యం బాగోలేదని పట్టణంలోని ఓ ప్రయివేట్ నర్సింగ్ హోంలో చికిత్స తీసుకున్నాడు. తీరా ఏమైయిందో ఏమోగానీ శనివారం ఉదయం పెద్దపల్లి గంగమ్మ దేవాస్థానం వద్ద మృతి చెందాడు.

తప్పకదా 'గురూ'!

- డీఎస్సీలో నకిలీ సర్టిఫికెట్లు
- పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్‌లో వెలుగు చూసిన బోగస్ పత్రాలు
- గత నెల 28 నుంచి విడతల వారీగా పరిశీలన
- దీనిపై అభ్యర్థుల్లో పలు అనుమానాలు



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

- **జిల్లాకు చెందిన కొందరు అభ్యర్థులు ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నారు. ఆ కోటాలో ఎంపికయ్యి.. సర్టిఫికెట్ల వెరిఫికెషన్ వరకు వచ్చేశారు. అయితే వారికి ఆ కోటా వర్తించదని అధికారులు తేల్చడంతో అనర్హులుగా వెనుదిరిగారు. తరువాత స్థానాల్లో ఉన్న వారికి కాల్ లెటర్లు పంపించేందుకు చర్యలు చేపట్టారు.**
- **పీహెచ్‌సీ కోటాలో పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ కోటాలో ఎలాగైనా ఉద్యోగం సాధించాలని తప్పుడు పత్రాలు అప్‌లోడ్ చేశారు. సదరం సర్టిఫికెట్‌లో అంధత్వ శాతం ఎక్కువగా చూపించారు. విద్యాశాఖ అధికారులు ఆధ్వర్యంలో వైద్యులు తనిఖీలు నిర్వహించగా అసలు విషయం బయట పడి అనర్హులుగా తేలారు.**

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీ పోస్టులను కైవసం చేసుకునేందుకు కొందరు అభ్యర్థులు అడ్డదారులు తొక్కారు. ఎలాగైన కొలువులు కొట్టేదామని భావించారు. అయితే అధికారుల పరిశీలనలో అభ్యర్థులు సమర్పించిన వివరాలు, సర్టిఫికెట్లలో తప్పిదాలను గుర్తించారు. దీంతో పలువురు అభ్యర్థుల పై అనర్హత వేటు వేశారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలనలో ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపికైన వారిని ఆప్షన్ మేరకు ఒక పోస్టుకు పరిమితం చేశారు. ఇతర స్థానాల్లో ఉన్న తదుపరి అభ్యర్థులకు అవకాశం కల్పించారు.

బోగస్ సర్టిఫికెట్లతో మోసం

మెగా డీఎస్సీలో కొందరు అభ్యర్థులు బోగస్ సర్టిఫికెట్లు సమర్పించి మోసం చేసేందుకు ప్రయత్నించారు. దివ్యాంగ, అంధత్వ, చెవిటి, మూగ, ఇలా పలు రకాల వికలత్వంతో డీఎస్సీ పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి తిరుపతి రుయా ఆస్పత్రిలో మరోమారు పున:పరిశీలన నిర్వహించగా గుట్టురట్టయ్యింది. పలువురు అభ్యర్థులు సమర్పించిన వికలత్వ సర్టిఫికెట్లు బోగస్ అని అక్కడి వైద్యులు తేల్చారు. దీంతో అలాంటి వారందరినీ అనర్హులుగా ప్రకటించారు. మొత్తం 68 మంది పీహెచ్ కేటగిరీలో ఎంపికవగా వారిలో 56 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. మిగిలిన 12 మందివి బోగస్ సర్టిఫికెట్లుగా గుర్తించారు.

ఈడబ్ల్యూఎస్‌లో కూడా...

ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లలో కూడా కొన్ని నకిలీవి ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై పలువురు అభ్యర్థులు విద్యాశాఖ ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేశారు. అనుమానం, ఫిర్యాదులు అందిన అభ్యర్థుల ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. అయితే ఆ వివరాలు బయటకు రానివ్వకుండా విద్యాశాఖ అధికారులు తొక్కిపెట్టారు. గుర్తించిన బోగస్ సర్టిఫికెట్ల సమగ్రవివరాలను రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికల రూపంలో పంపించారు.

ఇప్పటికి మూడు విడతల్లో పరిశీలన

ఇప్పటికీ డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ మూడు విడతల్లో నిర్వహించారు. ఈనెల 6 నాటికి రెండు విడతల్లో పరిశీలన ప్రక్రియ నిర్వహించగా తాజాగా శనివారం మూడో విడతలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ఆ అభ్యర్థుల జాబితా ప్రకారం ఆదివారం మూడో విడత సర్టిఫికెట్‌ల పరిశీలన నిర్వహించనున్నారు.



డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన సమాచారం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నోటిఫైడ్ పోస్టులు -	1473
మొదటి విడతలో పరిశీలన చేసిన సర్టిఫికెట్లు -	1394
రెండో విడతలో పరిశీలన చేసిన సర్టిఫికెట్లు -	45
మూడో విడతలో చేయబోతున్న సర్టిఫికెట్లు -	23
పరిశీలన చేసిన పీహెచ్ కేటగిరీ సర్టిఫికెట్లు -	68
అర్హులైన పీహెచ్ కేటగిరీ అభ్యర్థులు -	56
అనర్హులైన పీహెచ్ కేటగిరీ అభ్యర్థులు -	12

ఇరుముడులు చెల్లించిన గణేష్ దీక్ష భక్తులు



ఇరుముడులు చెల్లింపునకు వచ్చిన తుని నియోజకవర్గానికి చెందిన భక్తులు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం 30 మంది గణేష్ దీక్ష భక్తులు ఇరుముడులు చెల్లించారు. కాకినాడలోని తునికి చెందిన భక్తులు మాలధారణ చేసి ఇరుముడులు చెల్లింపునకు కాణిపాకానికి విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జూనియర్ కాలేజీలో చోరీ

– ఇంటి దొంగల పనేనా?



దుండగులు పగులగొట్టిన రికార్డుల బీరువాలు

శాంతిపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ప్రిన్సిపల్ రూమును లక్ష్యంగా చేసుకుని శుక్రవారం రాత్రి దొంగలు పడ్డారు. విద్యుత్ సరఫరాను ఆపేసి, గది బయట వేసిన నాలుగు తాళాలను పగులగొట్టి లోనికి ప్రవేశించారు. మొత్తం ఆరు బీరువాలను పగులగొట్టి రికార్డులను చిందరవందర చేశారు. తమకు కావాల్సిన రికార్డులను గుర్తుతెలియని వ్యక్తులు పట్టుకుపోయినట్టు అనుమానిస్తున్నారు. క్లూస్ టీం వస్తుందన్న కారణంగా కాలేజీ సిబ్బంది ఏ వస్తువునూ తాకకపోవడంతో ఏయే రికార్డులు చోరీ అయ్యాయనేది ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవలే కాలేజీలో మొత్తం 16 సీసీ కెమెరాలు పెట్టించారు. శుక్రవారం రాత్రి చొరబడిన దుండగులు తమకు సంబంధించిన ఫుటేజీ దొరక్కుండా చేసేందుకు సీసీ టీవీలకు సంబంధించిన డీవీఆర్‌ను కూడా పట్టుకుపోయారు. కళాశాల నిర్వహణ లోపాలపై వచ్చిన ఫిర్యాదులతో ఈ నెల 9 శాఖాపరమైన విచారణ జరగనున్న నేపథ్యంలో ఈ చోరీ జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. విచారణలో తమ అక్రమాలు వెలుగు చూడకుండా చేసేందుకు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వారే రికార్డులను మాయం చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిపై కాలేజీ సిబ్బంది ఫిర్యాదు మేరకు రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కార్యకర్తపై దాడి



పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిబాబు

పుంగనూరు: ఆలయపనులకు చేపట్టరాదంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నేత దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని గడ్డంవారిపల్లె బీసీ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. గత ప్రభుత్వంలో గ్రామస్తుల వినతి మేరకు గంగమ్మ గుడి నిర్మాణ పనులు చేపట్టారు. పనులు ముగింపు దశలో ఉండగా గిరిబాబు మరికొందరితో కలిసి మదనపల్లెలో అవసరమైన టైల్స్ వేసుకొని గుడివద్దకు చేరుకున్నాడు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత ఓబులేసు పనులు చేపట్టరాదని, టైల్స్‌ను వాహనంలో నుంచి దింపరాదని అడ్డుకున్నాడు. ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిబాబు పై దౌర్జన్యంగా దాడికి తెగబడ్డాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారమిచ్చారు. అనంతరం బాధితుడ్ని పోలీసులే పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలిచారు. కేసు దర్యాప్తులో ఉంది.

టమాట ఢమాల్!



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

- ధరలు భారీగా పతనం
- బాక్సు రూ.200 వరకు తగ్గిన వైనం

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో సాగు వివరాలు

టమాట సాధరణ సాగు	5 వేల హెక్టార్లు
ప్రస్తుతం సాగైె విస్తీర్ణం	1,400 వందల హెక్టార్లు
కోత దశలో ఉన్న తోటలు	800 వందల హెక్టార్లు

పలమనేరు: ఇటీవల కురిసిన వర్షం టమాటా రైతుల కొంపముంచింది. దీనికితోడు మొన్నటి దాకా రూ.500 పలికిన బాక్సు టమాటా ధర ఉన్నట్టుండి శనివారం రూ.200 కంటే కిందికి పడిపోయింది. బయటి రాష్ట్రాల నుంచి వ్యాపారులు స్థానిక మార్కెట్లకు రాకపోవడంతోనే ధరలు పడిపోయినట్టు ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు.

తెగుళ్లతో తగ్గిన కాయల నాణ్యత

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా టమాటా తోటల్లో కుళ్లడం, రాలడం జరిగింది. దీంతోపాటు మచ్చ తెగుళ్లు వచ్చాయి. ఫలితంగా టమాటా క్వాలిటీ తగ్గింది. దీంతో ఉన్నట్టుండి బాక్సు ధర రూ.200కి పడిపోయింది. ఇప్పుడున్న తోటల్లోనూ వైరస్ తెగుళ్ల కారణంగా పంట దిగుబడి తగ్గడంతో పాటు క్వాలిటీ లేకుండా పోయింది. దీంతో రానున్న రెండు వారాల్లోనూ ధరలు మరింత తగ్గే అవకాశం ఉన్నట్టు మండీ వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

వాతావరణమే ముఖ్యం



టమాటా పంటకు ముఖ్యంగా సూర్యరస్మి ఉండాలి. ఇటీవల వర్షాల కారణంగా గాలిలో తేమ శాతం బాగా తగ్గింది. ఫలితంగా టమాటా తోటల్లో వైరస్ ప్రభావం పెరిగింది. పంట క్వాలిటీ దెబ్బతింటోంది. ఇలాంటి కాయలకు మార్కెట్‌లో మంచి ధర లభించదు. ముఖ్యంగా ఈ కాయలను ట్రాన్స్‌పోర్ట్ చేసేందుకు వీలుకాదు. ఎందుకంటే రెండురోజులకే ఇవి దెబ్బతింటాయి. అందుకే బయటి వ్యాపారులు ఇక్కడ కొనేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

– డా.కోటేశ్వరావు, ఉద్యానశాఖ సహాయసంచాలకులు

రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టా



ఈ దఫా వేరే రైతుపొలం కౌలుకు పెట్టుకుని రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. మూడెకరాల్లో టమాటాను సాగు చేశా. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. మొన్నటి వర్షాల కారణంగా కాయల నాణ్యత తగ్గింది. దీంతోపాట తెగుళ్లు శోకాయి. ఇప్పుడున్న ధలతో పంటకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కేలా లేదు. కచ్చితంగా టమాటా రైతులు అప్పులపాలే.

– గోవిందురెడ్డి, నాగమంగళం, పలమనేరు మండలం



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. హరికథా కాలక్షేపం, కూచిపూడి, భరతనాట్యం, గీతాలాపన, పౌరాణిక నాటిక ప్రదర్శనలు ఆహుతులను కట్టిపడేశాయి. తిరుపతికి చెందిన కలవకుంట మునిసాయికృష్ణ బృందం అన్నమాచార్య సంకీర్తనలు, ప్రత్యేక భజన పాటలు, సంగీత కచేరితో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సంగీత బృందం గాయని వానిష్ఠ, తబలా మురళీకృష్ణ, కీబోర్డు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా అద్భుత ప్రదర్శన ఇచ్చిన కళాకారులకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు.



ప్రశంసా పత్రాలతో కళాకారులు

